చిన్న కథ

# దత్తత

విశ్వనాథ రామారావు




అది ఏడంతస్థుల భవంతి కాదు. ఏదు ఆకులు పైన కప్పిన చిన్న గుడిశె. ఆ గుడిశెలోని వాళ్ళకు కడుపు నిండా తిండి, వంటినిండా బట్ట లేదని చూడగానే తెలుస్తోంది. దారినపోయే దానయ్యల కళ్ళకు ఆ గుడిశె ఆనటం లేదు. అందులో వుండేది సింహాచలం.

సింహాచలానికి పిల్లా జెల్లా అండా దండా ఏమీ లేవు. ఏక పార్టీ సభ్యుడిలా కాలం గడుపుతున్నాడు. అతని జుట్టులో నల్ల వెంట్రుకలు. తెల్ల వెంట్రుకలు కలసి మెలసి కాలం గడుపుతూ మత సామరస్యాన్ని చాటుతున్నాయి. కళ్ళు చాల లోతుకు పోయాయి, వేసవి నూతులు లాగా. అతని ఆస్థి ఒక కుక్కి మంచం. ఎప్పుడూ దానిమీదే పడుకుని వుంటాడు. పదవి పట్టుకుని వేళ్ళాడే రాజకీయ నాయకుడిలాగా, సింహాచలాన్ని వర్ణించడం వృథా. ఎందుకంటే అతనికి పదవీ లేదు, పలుకుబడీ లేదు. కడుపులోకి అన్నం లేకుండా కనీసం 40 రోజులైనా గడుపుతాడు. పచ్చి మంచినీళ్ళు త్రాగి జీవిస్తాడు.

ఆ గ్రామానికి కొత్తగా పార్టీ పెట్టిన నాయకులు వచ్చారు. గుడిసెలను చూసి ఎంతో వాపోయారు. తక్షణమే పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. అప్పుడు ఆ పార్టీ నాయకుడు "ఇది బక్క చిక్కిన దేశం. మన దేశంలో దరిద్ర నారాయణులు ఎక్కువగా యున్నారు. వారిని మనం ఆదుకోవాలి. అందుకు మనం నడుం బిగించి, ప్రగతిపథంలోకి దూకి ముందడుగు వేయాలి. మన జీవితాన్ని పేదలకు అంకితం చేయాలి. మీకు తెలుసు మన పార్టీ కొత్తగా బక్క చిక్కిన ప్రజలను దత్తత తీసుకునే కార్యక్రమం చేబట్టింది. ఈ విధంగా అన్ని పార్టీలు ముందుకు వస్తే భారతదేశంలో దరిద్రం పారిపోతుంది. ఈ రోజు మనం ఈ గ్రామంలో అన్నం లేకుండా మలమలా మాడుతున్న సింహాచలాన్ని దత్తత తీసుకుందాము. 40 రోజుల నుండి పస్తులున్న సింహాచలాన్ని దత్తత చేసుకోవడం చాలా గర్వించతగ్గ విషయం" అని నొక్కి చెప్పాడు. పార్టీ సభ్యులు చప్పట్లు కొట్టారు. నాయకుని ఔన్నత్యాన్ని ఛోటా నాయకులు స్తోత్రం చేశారు. అతనికి పూలమాల వేశారు. సభ ముగిసింది.

పార్టీ నాయకుడు, కార్యకర్తలూ సింహాచలం గుడిసెకు వెళ్ళారు "నిన్ను దత్తత తీసుకున్నాం" అన్నారు. కానీ అతనికి 'దత్తత' అంటే ఏమిటో తెలియదు. ఈ దత్తతలు ఇప్పుడు కొత్తగా వచ్చాయి కాబోలు అనుకున్నాడు. పార్టీవారు సింహాచలంతో "ఈ రోజు నుంచి నీకు అన్నం, బట్ట మేము పంపుతాము. నీ క్షేమమే మా ధ్యేయం. ఇక నుండి నీవు మా వెనకే నడవాలి" అన్నారు. సరే అని తలూపాడు సింహాచలం. అతని ముఖాన కోటి సూర్యుల వెలుగొచ్చింది. పార్టీ కార్యకర్తలు సింహాచలానికి జేజేలు పలికారు. అతని గుడిశెపై పార్టీ జండా కట్టారు. అన్ని పళ్ళ రసాలు యిచ్చి అతని నీరసం పోగొట్టారు.



ప్రస్తుతం సింహాచలం పార్టీ సభ్యుడు. పార్టీ డబ్బుతో బ్రతుకుతున్నాడు. పార్టీ పరిధిలోనే వుంటూ కడుపునిండా కూడు తింటున్నాడు. హాయిగా బ్రతుకు సాగిస్తున్నాడు. పార్టీ వారికి అతన్నెలా ఉపయోగించుకోవాలో తెలియక తికమక పడుచున్నారు. అతని దగ్గర డబ్బా లేదూ... మందీ మార్బలమూ లేదు.

ఇంతలో రాజధానిలో ప్రఖ్యాత దేశభక్తుని శిలా విగ్రహము ట్యాంక్ బండ్ వద్ద ప్రతిష్ఠించడానికి ప్రభుత్వం సంకల్పించింది. అందుకు పార్టీ నాయకులు తీవ్ర నిరసన తెలియజేసి, ఆ శిలా విగ్రహాన్ని బ్యాంక్ రోడ్ సెంటర్‌లో పెట్టాలని ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారు. ప్రభుత్వం లొంగలేదు. అందుకు నిరసనగా పార్టీ ఆందోళన ప్రారంభించింది. అయినా ప్రభుత్వం బెదరలేదు. చివరకు ఆ పార్టీ కార్యకర్తలు ఆ దేశభక్తుని సాన్నిధ్యంలోనే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయానికొచ్చారు. అందువల్ల పార్టీ బలం పుంజుకొంటుంది. పేరు, ప్రఖ్యాతులు పెరుగుతాయి అని వారి ఆశ. ఆమరణ నిరాహార దీక్షకు తగినవాడుగా సింహాచలాన్ని ఎంపిక చేశారు. ఎందుకంటే అతడు అన్నం తినకుండా తేలికగా 40 రోజులు బ్రతక గలడు. ఆవిధంగా అతడెన్నోసార్లు గడిపాడు. అతని బ్రతుకునకు ఏ భయమూ లేదు. మరో వ్యక్తయితే ప్రాణభయం రావచ్చు. అది పార్టీ వారి మనసుల్లోనున్న రహస్యం.

సింహాచలం అనుకున్న ప్రకారం ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. 30 రోజులు గడిచాయి. ప్రభుత్వం గడగడ లాడింది. పార్టీ వారి అభ్యర్థనను 31వ రోజున అంగీకరించింది. సింహాచలానికి పేరు వచ్చింది. పార్టీకి సంఘంలో బలం పెరిగింది. అందుకే సింహాచలాన్ని దత్తత చేసుకుంది.

Chief Editor: K. Jagadish Prasad, Printed and Published by him at Andhra Printers Ltd., Post Box No.: 712, VIJAYAWADA - 520 010.